RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY
తెలుగు దిన పత్రిక....

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న మెదక్‌టుడే దినపత్రికలో విలేకరులుగా పనిచేయుటకు బ్యూరో, మండలలా , జిల్లాల, నియోజకవర్గ స్థాయుల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

మెదక్ టుడే RNI NO: TELTEL/2023/88524 తెలుగు దిన పత్రిక....

Call us now! 9494117870

14 మే 2026 మెదక్ పేజీలు : 4 వెల రూ : 2 ఎడిటర్ సిహెచ్ శివకుమార్ సంపుటి 02 సంచిక 131-

## రైతులకు కేంద్రం భారీ ఊరట

**ఖరీఫ్ పంటలకు పెరిగిన మద్దతు ధరలు**
**మౌలిక సదుపాయాల అభివృద్ధికి వేల కోట్లు**
**వ్యవసాయం, రవాణా, ఇంధన రంగాలకు ప్రాధాన్యం**

**న్యూఢిల్లీ,మే,13,(మెదక్ టుడే న్యూస్)**ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో రైతాంగం, మౌలిక సదుపాయాలు, రవాణా, ఇంధన రంగాలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు దేశవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించింది. ఈ నిర్ణయాలు రైతులకు మాత్రమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రైతుల ఆదాయాన్ని పెంచడం ప్రధాన లక్ష్యంగా ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరలను కేంద్రం పెంచింది. పెట్టుబడి ఖర్చుపై కనీసం 50 శాతం అదనంగా లాభం వచ్చేలా ధరలను నిర్ణయించినట్లు కేంద్రం వెల్లడించింది. వరి క్వింటాల్‌కు రూ. 2,441 మద్దతు ధరను ఖరారు చేయగా, గ్రేడ్–ఏ వరికి రూ. 2,461గా నిర్ణయించారు. పెరిగిన ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు పండించిన ధాన్యానికి తగిన ధర లభిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.ఈ ఖరీఫ్ సీజన్‌కు మద్దతు ధరల అమలుకోసం కేంద్రం ఏకంగా రూ. 2.6 లక్షల కోట్లను కేటాయించడం ప్రాధాన్యత సంతరించుకుంది. గతంతో పోలిస్తే ఈసారి భారీగా నిధులు పెంచడం ద్వారా



రైతాంగానికి భరోసా ఇవ్వాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. రైతులు పంటను నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు సూచనలు జారీ చేసినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా ధాన్యం సేకరణ, నిల్వ, రవాణా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించినట్లు తెలుస్తోంది.వ్యవసాయ రంగంతో పాటు రవాణా, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా కేంద్ర కేబినెట్ పెద్దపీట వేసింది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుకు భారీ స్థాయిలో నిధులు కేటాయించడం ద్వారా దేశ విమానయాన రంగాన్ని మరింత విస్తరించాలని కేంద్రం భావిస్తోంది.అంతర్జాతీయ స్థాయి సదుపాయాలతో 2

## మోదీ, రేవంత్‌పై కవిత విమర్శలు

**పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదాకోరినకవితబండి సంజయ్ కుమారుడిపైలుక్‌అవుట్ నోటీసులు డిమాండ్‌నీటినిర్వహణపైపత్యేక కమిషన్ హామీ**

**హైదరాబాద్,మే,13,(మెదక్ టుడే న్యూస్)**తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు పొదుపు సూత్రాలు చెబుతూ ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం భారీగా నిధులు ఇస్తున్నారని ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాపై ప్రధాని ఒక్క మాట కూడా మాట్లాడలేదని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలుమార్లు కేంద్రాన్ని కలుస్తున్నారని, కానీ తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మాత్రం పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకోవడం లేదని విమర్శించారు. "మీ గురువును చూసైనా నేర్చుకోండి. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కోసం ప్రధానికి లేఖ రాయండి" అంటూ రేవంత్ రెడ్డికి సూచించారు.




రాష్ట్రానికి నీటి హక్కులు సాధించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.తెలంగాణ ఏర్పడింది నీళ్ల కోసమేనని గుర్తుచేసిన కవిత, గోదావరి,కృష్ణా నదుల్లో రాష్ట్రానికి ఉన్న వాటాను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నామని అన్నారు. గోదావరిలో 964 టీఎంసీలు వినియోగించే అవకాశం ఉన్నప్పటికీ కేవలం 220 టీఎంసీలు మాత్రమే వాడుకున్నామని తెలిపారు. కృష్ణా జలాల్లో కూడా రాష్ట్రం తన వాటాను పూర్తిగా వినియోగించుకోవడం లేదన్నారు. బీఆర్‌ఎస్ 2

## సైబర్ నేరాలపై సీఎం వార్నింగ్

**–రూ.652కోట్ల మోసాలపై ఆందోళన**
**- ఏపీ సైబర్ పాలసీకి చంద్రబాబు ఆదేశం**
**- పోలీస్‌బ్యాంకర్ల సమన్వయంపై ఫోకస్**

**అమరావతి,మే,13,(మెదక్ టుడే న్యూస్)**రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్, ఆర్థిక నేరాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేరాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలనే లక్ష్యంతో బుధవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో సైబర్ నేరాల తీవ్రత, ప్రజలు ఎదుర్కొంటున్న మోసాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో



సైబర్, ఆర్థిక నేరాలకు సంబంధించిన "1930" టోల్ ఫ్రీ నెంబర్‌కు ఇప్పటివరకు 9.29 లక్షల ఫిర్యాదులు అందినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ మోసాల కారణంగా ప్రజలు సుమారు రూ.652 కోట్ల మేర నష్టపోయినట్లు వెల్లడించారు.ప్రస్తుతం పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాలే రాష్ట్రంలో అతిపెద్ద ఆర్థిక నేరాలుగా మారాయని అధికారులు తెలిపారు. ఫిషింగ్, విషింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు మోసాలు, ఆన్‌లైన్ లోన్ మోసాలు, "డిజిటల్ అరెస్ట్" పేరిట జరుగుతున్న కొత్త తరహా మోసాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. సామాన్య ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నేరగాళ్లు భారీగా డబ్బులు దోచుకుంటున్నారని పేర్కొన్నారు. అయితే సీఐడీ సైబర్ క్రైమ్ విభాగం బ్యాంకర్లతో సమన్వయంగా పనిచేస్తూ రూ.116 కోట్లకు పైగా మొత్తాన్ని నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్లకుండా నిలువరించగలిగిందని అధికారులు తెలిపారు. "గోల్డెన్ అవర్"లో స్పందించడం వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. మోసానికి గురైన వెంటనే బాధితులు ఫిర్యాదు 2

## పోక్సో కేసులో భగీరథ్ ట్విస్ట్

**- విచారణకు గైర్హాజరైన బండి భగీరథ్**
**- రెండు రోజుల గడువు కోరిన లేఖ**
**- హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్**

**హైదరాబాద్,మే,13,(మెదక్ టుడే న్యూస్)**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ తనపై నమోదైన పోక్సో కేసుకు సంబంధించి బుధవారం పోలీసుల విచారణకు హాజరుకాలేదు. వ్యక్తిగత కారణాల వల్ల తాను హాజరుకాలేకపోతున్నానని, విచారణకు అందుబాటులోకి రావడానికి రెండు రోజుల గడువు



కావాలని పోలీసులకు లేఖ రాశారు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు మెయిల్ పంపించారు.మే 8న మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలతో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే తక్కువ సమయంలో నోటీసులు అందాయని, తనపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు, సమాచారం సేకరించేందుకు సమయం కావాలని భగీరథ్ తన లేఖలో పేర్కొన్నారు. దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని భగీరథ్ స్పష్టం చేసినట్లు సమాచారం. విచారణకు 2

## విద్యా వారోత్సవాలకు ప్రాధాన్యం

**హుస్నాబాద్‌లో విద్యా వర్క్‌షాప్ నిర్వహణ**
**సర్పంచ్‌లు, కౌన్సిలర్లతో చర్చలు**
**ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై దృష్టి**
**మంత్రి పొన్నం ప్రభాకర్**

**హుస్నాబాద్,మే,13,(మెదక్ టుడే న్యూస్)**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో హుస్నాబాద్ వైశ్య భవన్‌లో విద్యా వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి




రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌లో సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, విద్యాశాఖ అధికారులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల మెరుగుదలపై చర్చించారు. గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులు విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పొన్నం ప్రభాకర్ 2

## సరస్వతి పుష్కరాలకు సర్వం సిద్ధం

**మంత్రి కోమటిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత-భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు**
**గోదావరి పుష్కరాలపై ముందస్తు కసరత్తు**

**హైదరాబాద్,మే,13,(మెదక్ టుడే న్యూస్)**ఈ నెల 21 నుంచి ప్రారంభం



కానున్న సరస్వతి అంత్య పుష్కరాలకు హాజరుకావాలని కోరుతూ దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, అర్చకులు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వెల్లడించారు. దేవాదాయ శాఖ, ఆర్ అండ్ బీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. భక్తుల రాకపోకలు, పార్కింగ్, తాగునీరు, భద్రత, ఘాట్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రానున్న గోదావరి పుష్కరాల కోసం కూడా ప్రభుత్వం ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించినట్లు కోమటిరెడ్డి వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం పుష్కర ఘాట్ల నిర్మాణం, రోడ్డు కనెక్టివిటీ అభివృద్ధి పనులపై ప్రధానంగా దృష్టి పెట్టామని చెప్పారు.

## తిరుపతికి అంతర్జాతీయ టూరిజం రూపు

**తిరుపతి,మే,13,(మెదక్ టుడే న్యూస్)**తిరుపతిని కేవలం ఆధ్యాత్మిక క్షేత్రంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. తిరుపతిలో నిర్వహించిన పర్యాటక శాఖ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో చిత్తూరు, తిరుపతి,



అన్నమయ్య, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల పర్యాటక అభివృద్ధి ప్రణాళికలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.తిరుపతి పరిసర ప్రాంతాలను అనుసంధానిస్తూ కొత్త టూరిజం సర్క్యూట్లు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించేలా ఆధునిక సదుపాయాలు, ప్రత్యేక పర్యాటక మార్గాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తిరుమలతో పాటు ప్రకృతి, సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలను కలిపి పర్యాటకులకు ప్రత్యేక అనుభూతిని అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాను పర్యాటక రంగం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేసే "ఎకనామిక్ డిస్ట్రిక్ట్"గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. హార్సిలీహిల్స్‌లో ప్రత్యేక ఫెస్టివల్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాంతాన్ని ప్రకృతి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి దేశవ్యాప్తంగా మరింత గుర్తింపు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు.శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తీర ప్రాంతాల్లో అంతర్జాతీయ స్థాయి స్టార్ హోటళ్లు, రిసార్టుల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. జూలై నెలలో మైపాడు బీచ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు 2

## రైతులకు భారీ పరిహారం భరోసా

**కొల్లాపూర్,మే,13,(మెదక్ టుడే న్యూస్)**కొల్లాపూర్ నియోజకవర్గంలోని బొల్లారం గ్రామ రైతు వేదికలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సంగినేనిపల్లి, తూముకుంట, బొల్లారం గ్రామాల రైతులతో సమావేశమయ్యారు. భూసేకరణ, పరిహారం, సాగు భూముల సమస్యలపై రైతులతో నేరుగా మాట్లాడి వారి అభ్యర్థనలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అసైన్డ్ భూములు సాగు చేస్తున్న రైతులకు కూడా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. 2

# మోదీ, రేవంత్‌పై కవిత విమర్శలు

మొదటిపేజీ తరువాయి




అధికారంలోకి వస్తే సాగుయోగ్యమైన ప్రతి గుంటకు నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. నీటి నిర్వహణ కోసం ప్రత్యేకంగా వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై వచ్చిన ఆరోపణలను కూడా కవిత ప్రస్తావించారు. బండి సంజయ్ కుమారుడు దేశం విడిచి వెళ్లకుండా వెంటనే లుక్ అవుట్ నోటీసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు తీవ్రమైనవని, పారదర్శక విచారణ జరగాలంటే ఈ చర్యలు అవసరమని పేర్కొన్నారు. బాధితురాలి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో బయటకు రావడం దురదృష్టకరమని, వాటిని ప్రచారం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.మైనర్ బాలికలకు సంబంధించిన అంశాల్లో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కవిత పేర్కొన్నారు. సమాజం ఆడపిల్లలను సులభంగా క్షమించదని, అందువల్ల బాధితురాలి గోప్యత కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కొన్ని పార్టీలు కేవలం సామాజిక మాధ్యమాల్లో ట్వీట్లు పెట్టి సమస్య పరిష్కరించినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తాము ఎల్లప్పుడూ ఆడపిల్లల పక్షానే ఉంటామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లు, మహిళా బిల్లు, జనగణన అంశాలపై కూడా కవిత స్పందించారు. మహిళా బిల్లులో ఓబీసీ ఉపకోటా తప్పనిసరిగా ఉండాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులం, ఉపకులం, సామాజిక స్థితిగతులను నమోదు చేయాలని కోరారు. బీసీలకు రాజకీయాలు, విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ల కోసం చేపట్టిన పోరాటంలో భాగంగా కోర్టుకు కూడా వెళ్తున్నామని తెలిపారు.తెలంగాణలో రాజకీయ శూన్యతను ప్రశ్నించేందుకు తెలంగాణ రక్షణ సేన ఏర్పడిందని కవిత పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి వచ్చే నెల 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా "జెండా పండుగ" నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పార్టీ నిర్మాణానికి ఇది పునాదిగా నిలుస్తుందని, ఈ కార్యక్రమాల ద్వారా నాయకత్వ బాధ్యతలు కూడా అప్పగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో నీటి నిర్వహణ, రైతుల సంక్షేమం, సామాజిక న్యాయం అంశాలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# సైబర్ నేరాలపై సీఎం వార్నింగ్

మొదటిపేజీ తరువాయి




చేస్తే డబ్బును తిరిగి రికవరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వెల్లడించారు.దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీస్ యంత్రాంగం, బ్యాంకర్ల మధ్య మరింత బలమైన సమన్వయం అవసరమని స్పష్టం చేశారు. ఇతరుల బ్యాంకు ఖాతాలను నేరగాళ్లు దుర్వినియోగం చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం సమగ్ర "ఏపీ సైబర్ పాలసీ" రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా కూడా సైబర్ నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలలో ప్రత్యేక సైబర్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సీఐడీ ఆధ్వర్యంలో ప్రత్యేక సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ పనిచేస్తోందని వెల్లడించారు. ఈ సమావేశంలో హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజిత్, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్తో పాటు వివిధ బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతులకు భారీ పరిహారం భరోసా

మొదటిపేజీ తరువాయి





ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ రూ.1,87,500ను రెట్టింపు చేసి రూ.3,75,000గా నిర్ణయించాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. ఈ మార్కెట్ విలువ ఆధారంగా మూడింతల పరిహారం చెల్లించడంతో పాటు గెజిట్ ప్రచురించిన తేదీ నుంచి వడ్డీ కలిపి మొత్తం రూ.11.50 లక్షల వరకు పరిహారం అందించాలని స్పష్టం చేశారు. రైతులకు పరిహారం చెల్లింపులో ఆలస్యం జరగకుండా వెంటనే అవార్డు కాపీలు మంజూరు చేసి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆర్డీవోకు ఆదేశాలు జారీ చేశారు.సింగోటంగోపాల్ దిన్నె లింక్ కెనాల్ పనులను వేగవంతం చేయాలని కూడా మంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టు పనులు త్వరగా ప్రారంభమయ్యేలా భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు నష్టపరిహారం అందిన తర్వాతే పనులు చేపట్టేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు పూర్తయితే సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అసైన్డ్ పట్టాలు కలిగి ఉన్న రైతులకు కూడా సాధారణ పట్టాదారుల మాదిరిగానే పూర్తి పరిహారం చెల్లించాలని మంత్రి ఆదేశించారు. ఈ విషయాన్ని బొల్లారం సర్పంచ్ సుదర్శన్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన జూపల్లి కృష్ణారావు అసైన్డ్ రైతులకు ఎటువంటి అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి ప్రతి అర్హుడికి న్యాయం చేస్తుందని తెలిపారు.అలాగే అసైన్డ్ భూములు సాగు చేసుకుంటూ పట్టాలు లేని రైతులకు కూడా భూ సేకరణ చట్టంలోని 3ఆర్ నిబంధన ప్రకారం పూర్తి పరిహారం చెల్లించాలని మంత్రి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. భూములు సాగు చేస్తున్న ప్రతి రైతు కష్టాన్ని గుర్తించి పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భూసేకరణలో పారదర్శకత పాటిస్తూ రైతులకు నష్టం కలగకుండా చూడాలని సూచించారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా విని వెంటనే నిర్ణయాలు తీసుకోవడంతో స్థానిక రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. పరిహారం పెంపు, అసైన్డ్ రైతులకు కూడా వర్తింపజేయడం వంటి నిర్ణయాలు తమకు ఊరటనిస్తున్నాయని రైతులు పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే వ్యవసాయ రంగానికి మరింత మేలు జరుగుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# 'మేడ్ ఇన్ ఏపీ'పై లోకేష్ ఫోకస్




**అమరావతి,మే,13,(మెదక్ టుడే న్యూస్)**ఆంధ్రప్రదేశ్‌లో తయారీ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. "మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్" అనేది ఇప్పుడు నాణ్యతకు, నమ్మకానికి ప్రతీకగా మారుతోందని ఆయన తెలిపారు.రాష్ట్రంలోని పారిశ్రామిక పురోగతిని వివరిస్తూ బుధవారం సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేక పోస్టు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన వీడియోలో రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న పలు ప్రముఖ కంపెనీల తయారీ యూనిట్లు, ఉత్పత్తులను ప్రదర్శించారు. మొబైల్ ఫోన్లు, స్క్రీన్లు, ఏసీలు, బైక్‌లు, కార్ల వరకు భారతీయులు విశ్వసించే అనేక బ్రాండ్లు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతున్నాయని లోకేష్ పేర్కొన్నారు.ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, వేగవంతమైన పనుల అమలు, బలమైన తయారీ వ్యవస్థ కారణంగానే రాష్ట్రం పరిశ్రమలకు కేంద్రంగా మారుతోందని మంత్రి తెలిపారు. పారిశ్రామిక వేత్తలకు అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షిస్తోందని వెల్లడించారు. "మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ్" అనేది క్రమంగా దేశవ్యాప్తంగా నాణ్యత, విశ్వసనీయతకు చిహ్నంగా నిలుస్తోందని లోకేష్ పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్‌లో తయారు చేయండి.. ప్రపంచం కోసం తయారు చేయండి" అంటూ పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానాలతో ముందుకు సాగుతోందని మంత్రి వివరించారు. తయారీ రంగంలో పెట్టుబడులు పెరగడం ద్వారా ఆర్థికాభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. దేశీయ, అంతర్జాతీయ సంస్థలు ఏపీ వైపు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు. పరిశ్రమలకు అవసరమైన భూములు, విద్యుత్, రవాణా, నైపుణ్య అభివృద్ధి వంటి అంశాల్లో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని మంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రశ్రేణి తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

# రైతులకు కేంద్రం భారీ ఊరట

మొదటిపేజీ తరువాయి



ఈ విమానాశ్రయం అభివృద్ధి చెందితే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, వాణిజ్య రంగాలకు ఊతం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ఇంధన భద్రతకు సంబంధించి కేంద్రం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశ భవిష్యత్ ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ. 37,500 కోట్లతో ప్రత్యేక ప్రణాళికకు ఆమోదం తెలిపింది. పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, పరిశ్రమల విస్తరణ, హరిత ఇంధన వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేయాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. దేశాన్ని ఇంధన రంగంలో స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయాలు ఉపయోగపడతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రవాణా రంగంలో భాగంగా సర్కేజీధోలేరా మధ్య సెమీ హైస్పీడ్ డబుల్ రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం రూ. 20,065 కోట్లను మంజూరు చేశారు. ఈ రైల్వే మార్గం పూర్తయితే సరుకు రవాణా వేగవంతం కావడంతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని అధికారులు చెబుతున్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి కీలకమైన రవాణా రంగాన్ని ఆధునీకరించడంలో ఈ ప్రాజెక్టు ముఖ్య పాత్ర పోషించనుందని కేంద్రం భావిస్తోంది. రైతాంగం నుంచి పరిశ్రమల వరకు అన్ని రంగాలకు మద్దతు ఇచ్చేలా కేంద్ర కేబినెట్ తీసుకున్న తాజా నిర్ణయాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# పోక్సో కేసులో భగీరథ్ ట్విస్ట్

మొదటిపేజీ తరువాయి



హాజరయ్యేందుకు మరో తేదీని సూచించాలని పోలీసులను కోరారు. ప్రస్తుతం ఈ వ్యవహారం రాజకీయంగా కూడా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఈ కేసులో పోలీసులు కఠినమైన పోక్సో చట్టంలోని సెక్షన్ 5(ఎల్), 6లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ సెక్షన్ల కింద నేరం రుజువైతే 20 ఏళ్లకు పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు.ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు డీసీపీ రితిరాజ్ పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోంది. బాధితురాలి వాంగ్మూలం, సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా భగీరథ్ ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరగనుంది. మరోవైపు తమపై తప్పుడు కేసు పెట్టి రూ.5 కోట్లు డిమాండ్ చేశారని ఆరోపిస్తూ బాధితురాలి కుటుంబంపై భగీరథ్ కరీంనగర్‌లో ఫిర్యాదు చేసిన విషయం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది.

# విద్యా వారోత్సవాలకు ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి





పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, ఎంఈవోలు, హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి మండలాల సర్పంచ్‌లు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# తిరుపతికి అంతర్జాతీయ టూరిజం రూపు

మొదటిపేజీ తరువాయి



వెల్లడించారు. మైపాడు బీచ్‌కు ప్రతిష్ఠాత్మక బ్లూఫ్లాగ్ గుర్తింపు తీసుకురావడానికి అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. పర్యాటకుల భద్రత, పరిశుభ్రత, సేవల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని అధికారులను హెచ్చరించారు. ఇకపై ప్రతి మూడు నెలలకోసారి సమీక్షా సమావేశాలు నిర్వహించి పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని నేరుగా పర్యవేక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు. పర్యాటక ఆస్తుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక ఉత్సవాలు, స్థానిక సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. "హోమ్ స్టే", "బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్" విధానాలను ప్రోత్సహించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.

# సనాతన ధర్మంపై మళ్లీ ఉదయనిధి వ్యాఖ్యలు



**చెన్నై,మే,13,(మెదక్ టుడే న్యూస్)**డీఎంకే నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ మరోసారి సనాతన ధర్మంపై తన పాత వైఖరిని పునరుద్ఘాటించారు. ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీలో ప్రసంగించిన ఆయన, మనుషుల మధ్య దూరాన్ని పెంచి విభజన తెచ్చే సనాతన ధర్మాన్ని అంతం చేయాలన్న తన అభిప్రాయాన్ని మళ్లీ వ్యక్తం చేశారు.అయితే ఇదే సమయంలో రాజకీయ పరిణతిని కూడా ప్రదర్శించిన ఉదయనిధి, కొత్త ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్కు శుభాకాంక్షలు తెలిపారు. అధికార, ప్రతిపక్షాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ తమిళనాడు అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని సూచించారు. అసెంబ్లీలో రాజకీయ మర్యాదలు కొనసాగాలని కోరారు. ఉదయనిధి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా స్పందించారు. అధికారం కోల్పోయినా ఉదయనిధికి ఇంకా జ్ఞానోదయం కలగలేదని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మంపై గతంలో చేసిన అనుచిత వ్యాఖ్యల వల్లే ప్రజలు డీఎంకేను తిరస్కరించారని విమర్శించారు. సర్వజనుల శ్రేయస్సును కోరే ధర్మమే సనాతన ధర్మమని రఘునందన్ రావు పేర్కొన్నారు. అందరి మంచిని కోరుకునే ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని విమర్శించడం తగదన్నారు. హిందూ సంప్రదాయాలను గౌరవించాలని, భవిష్యత్తులో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఉదయనిధికి సూచించారు.రఘునందన్ రావు బుధవారం తిరుమలలో తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంను దర్శించుకున్నారు. దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ ఉదయనిధి వ్యాఖ్యలపై మండిపడ్డారు. మత విశ్వాసాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడం సమాజంలో విభేదాలకు దారితీస్తుందని అన్నారు. సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు గతంలో దేశవ్యాప్తంగా పెద్ద రాజకీయ దుమారానికే దారితీశాయి. ఇప్పుడు మళ్లీ అదే అంశాన్ని ప్రస్తావించడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. అధికార, ప్రతిపక్షాల మధ్య ఈ వ్యాఖ్యలపై మరోసారి మాటల యుద్ధం కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

మెదక్ టుడే
తెలుగు దిన పత్రిక....
RNI NO: TELTEL/2023/88524

# రామన్నపేటలో ఆధ్యాత్మిక వైభవం

## అట్టహాసంగా ప్రతిష్ఠాపన మహోత్సవం-ఆలయానికి మంత్రి విరాళం

**ఖమ్మం,మే,13,(మెదక్ టుడే న్యూస్)**ఖమ్మం కార్పొరేషన్ 60వ డివిజన్ పరిధిలోని రామన్నపేటలో శ్రీ పెద్దమ్మ తల్లి, పోతురాజు, సింహ వాహన, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రికి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారంగా మంత్రి రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ భక్తి మార్గం ద్వారానే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ధార్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. గ్రామాల్లో



సుఖశాంతులు నెలకొని ప్రజలు ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ ఉత్సవాలు బుధవారం ప్రధాన ఘట్టంతో ముగిశాయి. ఉదయం సుముహూర్తాన వేద మంత్రోచ్చారణల మధ్య యంత్రస్థాపన, బింబస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. పంచముఖి నాగేంద్రుడు, జంట నాగుల ప్రతిష్ఠాపన, నేత్రోన్మీలన, ప్రాణ ప్రతిష్ఠాపన వంటి కార్యక్రమాలను అర్చక బృందం శాస్త్రోక్తంగా పూర్తి చేసింది. ప్రతిష్ఠాపన మహోత్సవంతో రామన్నపేట ప్రాంతం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమాల అనంతరం పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మహా అన్నదాన కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, రామన్నపేట పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సందడితో నిండిపోయింది.

# కాంగ్రెస్‌బీజేపీపై వద్ది రాజు విమర్శలు



**హైదరాబాద్,మే,13,(మెదక్ టుడే న్యూస్)**రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన సాగుతోందా లేక బీజేపీ ప్రభావం పనిచేస్తోందా అన్నది అర్థం కావడం లేదని రాజ్యసభ సభ్యుడు వద్ది రాజు రవిచంద్ర విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు భగీరథ్‌కు సంబంధించిన వ్యవహారంలో కేసులు నమోదు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన వద్ది రాజు రవిచంద్ర కరీంనగర్‌లోని నగల దుకాణంలో జరిగిన దొంగతనం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి వంటి ఘటనలపై పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. చట్టం ముందు అందరూ సమానమే అయితే ఈ కేసులో ఎందుకు ఆలస్యం జరుగుతోందని ప్రశ్నించారు.కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఢిల్లీలో కలిసి పనిచేస్తున్నాయని వద్ది రాజు ఆరోపించారు. పోక్సో కేసు నమోదు అయితే ప్రతిసారీ ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలపై దాడులు జరగడం మంచి సంప్రదాయం కాదని పేర్కొంటూనే, బాధితురాలికి న్యాయం జరగాలన్న ఉద్దేశంతోనే బీఆర్ఎస్ పోరాటం చేస్తోందని తెలిపారు. ఈ కేసులో సిట్ దర్యాప్తుకు సహకరిస్తారా లేదా అన్న విషయంపై బండి సంజయ్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇది కులాలకు సంబంధించిన సమస్య కాదని, శాంతిభద్రతలకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ వెనుకబడిన వర్గాలకు చెందిన వారేనని గుర్తు చేశారు. ఈ అంశాన్ని రాజకీయ కోణంలో కాకుండా చట్టపరంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు.బాధితురాలి కోసం నిజాయితీగా పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని వద్ది రాజు పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని కేసు విచారణను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికార కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ఈ కేసు దర్యాప్తు, పోలీసుల చర్యలు, రాజకీయ పార్టీల స్పందనపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

# మహబూబాబాద్ గ్రంథాలయ సంస్థకు కొత్త చైర్మన్

**మహబూబాబాద్,మే,13, (మెదక్ టుడే న్యూస్)** మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా వెన్నం శ్రీకాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క హాజరై నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయాల అభివృద్ధికి సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. నూతన చైర్మన్‌కు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. గ్రంథాలయాలు విద్యా వికాసానికి కేంద్రబిందువులుగా నిలుస్తాయని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు విజ్ఞానాన్ని చేరవేసే ప్రధాన వేదికలుగా గ్రంథాలయాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఆధునిక సదుపాయాలతో జిల్లా గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తే విద్యార్థులకు మరింత ఉపయోగకరంగా మారుతాయని అభిప్రాయపడ్డారు.ప్రస్తుతం డిజిటల్





యుగంలో కూడా పుస్తకాల ప్రాముఖ్యత తగ్గలేదని, గ్రంథాలయాలను సాంకేతికంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని నాయకులు సూచించారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని కోరారు. పాఠకుల సంఖ్య పెరిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వెన్నం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు పాఠకులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు, యువత, పుస్తక ప్రేమికులకు ఉపయోగపడే విధంగా కొత్త కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో గ్రంథాలయ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అధికారులు తెలిపారు. కొత్త చైర్మన్ బాధ్యతలు స్వీకరించడంతో జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# శభాష్‌పల్లిలో వ్యక్తి హత్య

## గ్రామ శివారులో మృతదేహం కలకలం
## ట్రాక్టర్ డ్రైవర్‌గా గుర్తింపు
## హత్య కారణాలపై పోలీసుల దర్యాప్తు

**శివ్వంపేట,మే,13,(మెదక్ టుడే న్యూస్)**మెదక్ జిల్లా శివ్వంపేట మండలం శభాష్‌పల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తిని హత్య చేసి పడేయడంతో స్థానికంగా కలకలం రేగింది. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్తులు రోడ్డుపక్కన మృతదేహాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఘటన స్థలానికి తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, స్థానిక ఎస్ఐ మధుకర్ రెడ్డి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లో ఆధారాల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు స్థానికులను ప్రశ్నించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో మృతుడు హైదరాబాద్



ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన ఎండీ అన్వర్గా గుర్తించారు. ఆయన ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హత్య చేసి శభాష్‌పల్లి గ్రామ శివారులో పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్య వెనుక వ్యక్తిగత వైరం, ఆర్థిక లావాదేవీలు లేదా ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడు చివరిసారిగా ఎవరితో కనిపించాడు, ఎక్కడికి వెళ్లాడు అనే విషయాలపై సమాచారం సేకరిస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.ఘటన విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ పోషణ కోసం ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న అన్వర్ హత్యకు గురవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో శివ్వంపేట మండలంలో మరోసారి భద్రతా పరిస్థితులపై చర్చ మొదలైంది. గ్రామ శివారుల్లో రాత్రివేళల పర్యవేక్షణను మరింత పెంచాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని, త్వరలోనే నిందితులను గుర్తిస్తామని వెల్లడించారు.

## స్టేట్ అక్రిడేషన్ కార్డు అందుకున్న డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు

# ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఘన సత్కారం

**(స్పెషల్ కరస్పాండెంట్)**
**హైదరాబాద్,మే,13,మెదక్ టుడే న్యూస్:**క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ ఇంగ్లీష్ డైలీ



రాష్ట్ర స్పెషల్ కరస్పాండెంట్, ప్రముఖ జర్నలిస్ట్ డాక్టర్ కొమ్ము వెంకన్న బాబుకు తెలంగాణ రాష్ట్ర మీడియా అక్రిడేషన్ కార్డు అందజేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ఆయన అక్రిడేషన్ కార్డును ఘనంగా స్వీకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం సమాజానికి దిక్సూచి వంటిదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తీసుకువస్తూ బాధ్యతాయుత పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. గ్రామీణ స్థాయి సమస్యలను సమర్థవంతంగా ప్రజల దృష్టికి తీసుకువస్తూ విశ్వసనీయతను సంపాదించుకున్న డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు సేవలు అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవాభావం, నిబద్ధతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. క్యాపిటల్ ఇన్ఫర్మేషన్ చీఫ్ ఎడిటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు సంస్థకు గర్వకారణమని అన్నారు. నిబద్ధత, క్రమశిక్షణ, వృత్తి నైపుణ్యంతో వార్తలను అందిస్తూ మీడియా రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. రాష్ట్ర అక్రిడేషన్ కార్డు మా సంస్థ ద్వారా ఆయనకు మూడోసారి లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. గత పది సంవత్సరాలుగా సంస్థ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలకు, జర్నలిజం పట్ల ఆయన చూపుతున్న అంకితభావానికి ఇది నిదర్శనమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రెస్ అకాడమీ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తారని అన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలను బాధ్యతాయుతంగా ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు నిజాయితీ, నిబద్ధత కలిగిన జర్నలిస్టుగా మంచి గుర్తింపు పొందారని అభినందించారు. అక్రిడేషన్ కార్డును ప్రెస్ అకాడమీ చైర్మన్ చేతుల మీదుగా అందుకోవడం తనపై మరింత బాధ్యతను పెంచిందని డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు తెలిపారు. ప్రజా సమస్యలపై మరింత సమర్థవంతంగా స్పందిస్తూ జర్నలిజం విలువలను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హైదరాబాద్ సీనియర్ జర్నలిస్ట్ నగేష్ కొర్ర, సెక్రటేరియట్ జర్నలిస్ట్ శ్రీకాంత్ , డెస్క్ ఇంచార్జ్ కిరణ్, నందిగామ జర్నలిస్ట్ సురేందర్, పలువురు జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు, ప్రెస్ అకాడమీ అధికారులు పాల్గొని డాక్టర్ కొమ్ము వెంకన్న బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

## అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు

# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్

**చేగుంట,మే,13మెదక్ టుడే న్యూస్:**రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డినాయకత్వం ప్రత్యేకంగా 5 లక్షల నిధులతో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లుబుధవారం చేగుంట మండలం చందాయిపేట్ గ్రామంలో దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అదేశాల మేరకు లబ్ధిదారు నిరుడి పుష్ప నూతన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం ప్రారంభించిన మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడానికి ప్రతి ఇంటికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నాం.అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందే వరకు మా కృషి కొనసాగుతుంది. ప్రజా పాలనలో పేదల సంక్షేమమే మా





మొదటి ప్రాధాన్యత అని అన్నారు ఈ కార్యక్రమంలో చేగుంట మండల ప్రెసిడెంట్ వడ్ల నవీన్ కుమార్ చందాయిపేట్ సర్పంచ్ తాలూకా మహేశ్వరీ సాయిబాబా, ఉపసర్పంచ్ నాగేష్ గుప్తా, పంచాయతీ సెక్రటరీ కృష్ణ,,చేగుంట ఉపసర్పంచ్ రఫీ, మార్కెట్ డైరెక్టర్ లు మహమ్మద్ ముజామిల్, అన్నం ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కొండి శ్రీనివాస్, గ్రామ సీనియర్ నాయకులు దండు మహేష్, బాస్ రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# వెట్‌ల్యాండ్స్ పరిరక్షణకు వేగం

నోటిఫికేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు
డిజిటల్ మ్యాపింగ్, సరిహద్దుల గుర్తింపుపై దృష్టి
రామ్‌సార్ గుర్తింపుకు మంజీరా ప్రతిపాదనలు



**హైదరాబాద్,మే,13,(మెదక్ టుడే న్యూస్)**రాష్ట్రంలోని వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ, అధికారిక నోటిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. చెరువులు, నీటి వనరులు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. వెట్‌ల్యాండ్స్ పరిరక్షణ, నిర్వహణ నిబంధనలు2017ను కచ్చితంగా అమలు చేయాలని సమావేశంలో స్పష్టం చేశారు. వెట్‌ల్యాండ్స్ సరిహద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత శాఖలకు సూచనలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 12,249 వెట్‌ల్యాండ్స్‌పై గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ పూర్తయిందని అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 4,023 వెట్‌ల్యాండ్స్‌కు సరిహద్దుల నిర్ధారణ పూర్తైనట్లు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్త సర్వేలు పూర్తి చేసి అవసరమైన నివేదికలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. జిల్లా వెట్‌ల్యాండ్ అథారిటీల నుంచి ఖచ్చితమైన సమాచారం అందేలా శాఖల మధ్య సమన్వయం పెంచాలని పేర్కొన్నారు. ఖమ్మం, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలకు చెందిన ప్రధాన వెట్‌ల్యాండ్స్ సహా 28 ప్రాంతాలకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు సిద్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో గెజిట్ నోటిఫికేషన్, ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. మంజీరా వన్యప్రాణి అభయారణ్యానికి అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగిన రామ్‌సార్ సైట్ గుర్తింపు పొందేందుకు పంపిన ప్రతిపాదనపై కూడా సమావేశంలో చర్చించారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన ఇరిగేషన్ శాఖ వద్ద తుది పరిశీలనలో ఉందని, అనంతరం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖకు పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు. వెట్‌ల్యాండ్స్ పరిరక్షణలో నిపుణుల సూచనలు, శాస్త్రీయ అధ్యయనాలు కీలకమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు విజయవంతమైన నమూనాలను ప్రచారం చేయడంతో పాటు స్థానిక స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వెట్‌ల్యాండ్స్‌లో ఆక్రమణలు, ఘన వ్యర్థాల పారవేత, శుద్ధి చేయని మురుగు నీటి విడుదల వంటి చర్యలు పూర్తిగా నిషేధించబడినవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, అటవీ దళాల అధిపతి డాక్టర్ సువర్ణ, వైల్డ్‌లైఫ్ చీఫ్ వినయ్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి
### ఆర్డీవో జయ చంద్రారెడ్డి






**చేగుంట,మే,13,మెదక్ టుడే న్యూస్:**చేగుంట మండలంలోని రెడ్డిపల్లి (డీసీఎంస్ ) ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ (పీపీసీ ) ను తూప్రాన్ ఆర్డిఓ జయచంద్ర రెడ్డి సందర్శించి జరుగుతున్న వరి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడానికి కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో తరలించడానికి అదనపు లారీల అవసరం ఉందని ఆర్డీవో గుర్తించారు. లోడింగ్ అన్‌లోడింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేలా లారీల అందుబాటును పెంచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనంగా, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎం వి ఐ) పోలీస్ శాఖలతో సమన్వయం చేసుకుని ప్రైవేట్ వాహనాలను నియంత్రించి, ఆ లారీలను పీపీసీ కేంద్రాలకు మళ్లించాలని అధికారులకు సూచించారు. దీని ద్వారా ప్యాడీ రవాణాకు లారీల లభ్యత మెరుగుపడి రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో జయచంద్రారెడ్డి ఆదేశించారు. ఆర్డీవో తో పాటు చేగుంట తహసిల్దార్ ఆర్ ఐ లు జి పి ఓ పాల్గొనడం జరిగింది.

# 45 ఏళ్ల తర్వాత ఇంటర్ పరీక్ష

- పరీక్ష రాసిన మాజీ మావోయిస్టు నేత
- కోరుట్లలో తెలుగు పరీక్షకు హాజరు
- న్యాయవాది కావాలన్న దేవ్‌జీ లక్ష్యం



**జగిత్యాల,మే,13,(మెదక్ టుడే న్యూస్)**మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ 45 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారారు. బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇంటర్మీడియట్ పరీక్షకు హాజరయ్యారు. ఆయన పరీక్ష రాయడం స్థానికంగా ఆసక్తికర చర్చకు దారితీసింది. దేవ్‌జీ 198082 కాలంలో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌లో ఇంటర్మీడియట్ చదివారు. ఆ సమయంలో విద్యార్థి రాడికల్ యూనియన్‌లో పనిచేస్తూ రెండో సంవత్సరం తెలుగు పరీక్షను బహిష్కరించారు. దీంతో ఆ సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు. అనంతరం ఆయన మావోయిస్టు ఉద్యమంలో చేరి అడవిబాట పట్టారు. ఈఏడాది ఫిబ్రవరిలో మావోయిస్టు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన దేవ్‌జీ, విద్యను పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. ఇంటర్ బోర్డు ప్రత్యేక అనుమతితో మళ్లీ పరీక్ష రాసే అవకాశం లభించింది. గత కొద్ది రోజులుగా పరీక్ష కోసం ప్రత్యేకంగా సిద్ధమయ్యారని తెలిసింది. బుధవారం కోరుట్లలోని మ్యాస్ట్రో జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి చేరుకున్న దేవ్‌జీ తెలుగు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష అనంతరం మాట్లాడుతూ విద్య జీవితాన్ని మార్చగల శక్తి అని పేర్కొన్నారు. చదువు పూర్తి చేసి సమాజానికి ఉపయోగపడే దిశగా పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో న్యాయవాద కోర్సు చదివి పేద ప్రజల కోసం పనిచేయాలన్నదే తన లక్ష్యమని దేవ్‌జీ వెల్లడించారు. చట్టపరమైన అవగాహన ద్వారా సామాన్య ప్రజలకు న్యాయం అందించాలనుకుంటున్నట్లు చెప్పారు. జీవితంలో ఎప్పుడైనా మార్పు సాధ్యమేనని యువతకు సందేశం ఇచ్చారు. దేవ్‌జీ పరీక్ష రాయడం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఒకప్పుడు ఉద్యమ బాట పట్టిన వ్యక్తి మళ్లీ విద్యాభ్యాసం వైపు అడుగులు వేయడం పలువురిని ఆలోచింపజేస్తోంది. ఆయన నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు.

శిశు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు -జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి

## శిశు విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమ అధికారి.





**మెదక్ జిల్లా,కొల్చారం,మే,13,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి,**ఆడ శిశువును 3 లక్షలకు అమ్మిన తల్లి తండ్రులు కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తాండకు చెందిన దంపతులు తమ 4 వ శిశువును అమ్ముకున్నారనే విషయం మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేపట్టడం జరిగినది. ఇట్టి విచారణలో కన్న తల్లి తండ్రులు తమ పాపను 3 లక్షలకు అమ్ముకున్నారని నిర్ధారించుకుని సంబంధిత పోలీస్ స్టేషన్ లో తగు చర్యల కొరకై పిర్యాదు చేయడం జరిగినది. ఇట్టి విచారణలో తెలిసినది కొల్చారంమండలం పోతిరెడ్డిపల్లి తాండకు చెందిన దంపతులకు ఇదివరకే 3 సంతానం ఉండగా తేదీ 27.3.2026 నాడు మెదక్ లోని ఎం సి హెచ్ హాస్పిటల్ లో ఆడ పాప జన్మించడం జరిగినది. పాపను దంపతులిద్దరూ 3 లక్షలకు కొంత మంది మధ్యవర్తుల ద్వారా అల్లినగర్, ములుగు మండలం సిద్దిపేట జిల్లాకు చెందిన దంపతులకు విక్రయించడం జరిగించడం జరిగినది. ఇట్టి విషయం పోలీస్ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి పాపను తీసుకువచ్చి మహిళా శిశు సంక్షేమ అధికారులకు అప్పగించడం జరిగినది అధికారులు సంబంధిత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు పాపను తదుపరి సంరక్షణ నిమిత్తం సంగారెడ్డి లోని శిశు గృహ కు తరలించి ఆశ్రయం కల్పించడం జరిగినది. జిల్లాలో అక్రమ దత్తత తీసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియచేస్తూ, ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవలంటే ప్రభుత్వ నియమ నిభందనల ప్రకారం మహిళా శిశు సంక్షేమ శాఖ లోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### విద్యా ప్రమాణాల పెంపుదలకు చర్యలు
# మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**పాపన్నపేట,మే,13,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి,**కస్తూర్బా గాంధీ పాఠశాలలో రూ.42 లక్షలతో అదనపు గదులువిద్యార్థినులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పాపన్న పేట కస్తూరిభా గాంధీ పాఠశాల లో సమగ్ర శిక్ష అభియాన్ నిధులతో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో రూ.42 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదులు, డార్మిటరీ హాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థినులకు విశాలమైన తరగతి గదులు, వసతిసౌకర్యాలుఅందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా హాస్టల్‌లో ఉండే బాలికలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనపు మౌలిక వసతులు అవసరమయ్యాయని, ఈ పనులు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ పావని గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు వెంకటేశం, సర్పంచులు శ్రీధర్, శ్రీనివాస్, ఉప సర్పంచ్ సద్దాం హుసేన్, నాయకులు కిష్టయ్య, శివయ్య, అంజి, హీరోలాల్, ప్రవీణ్ గౌడ్, ప్రసాద్ గౌడ్, నాని, సుఫీ,ఖలీం తోపాటు తహసీల్దార్ సతీష్, పీఆర్ ఎఇ శ్రీకాంత్ పాఠశాల ఎస్ ఓ బాల లక్ష్మి, మమత తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట షెడ్యూల్ ను పున పరిశీలించాలి తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్



**చేగుంట,మే,13,మెదక్ టుడే న్యూస్:**తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ చేగుంట లో విలేకరులతో మాట్లాడుతూ సెన్సెస్ 2027 మొదటి దశ కార్యక్రమం మే 11 నుంచి జూన్ 9 వరకు ఉందని, అదేవిధంగా బడిబాట షెడ్యూల్ మే 14 నుండి జూన్ 19 వరకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూలు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని వారు అన్నారు. చాలామంది ఉపాధ్యాయులు సెన్సెస్ 2027లో పాల్గొని, ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని, ఉపాధ్యాయులు ఒకేసారి రెండు కార్యక్రమంలో ఎలా పాల్గొంటారని, ఒక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు సెన్సెస్ డ్యూటీలో ఉన్నప్పుడు బడిబాట కార్యక్రమం ఎలా నిర్వహిస్తారని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జయశంకర్ బడిబాట షెడ్యూల్ ను పున: పరిశీలించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో తపస్ జిల్లా ఉపాధ్యక్షులు దేశ పతి కృష్ణమూర్తి, చేగుంట మండల అధ్యక్షులు రావుల వెంకటేష్, శివంపేట పేట్ మండల ప్రధాన కార్యదర్శి జెట్టి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల గణన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి
### జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**పాపన్నపేట,మే,13,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి,**పాపన్నపేట మండలంలోని కుర్తివాడ గ్రామంలోని జనగణన 2027 ను తాహాసిల్దార్ తో కలిసి పరిశీలించారు. జనగణన 2027లో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర అన్నారు. జిల్లాలోని కొనసాగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను ఆకస్మికంగా సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల గణన ప్రక్రియను అధికారులు నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, గృహ జాబితా కార్యక్రమం భవిష్యత్తు ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి టి సి పి ఓ జన గణన అధికారులు ఎన్యుమరేటర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.